క్లుప్తంగా

ఓంశాంతిలో గీతాజయంతి వేడుకలు



ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో గీతా జయంతి

రాయదుర్గంటౌన్: విశ్వ మానవాళికి గీతజ్ఞానం సంజీవినిలా పనిచేస్తుందని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సంచాలకురాలు బీకే యోగీశ్వరి తెలిపారు. శుక్రవారం స్థానిక ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో గీతా జయంతి జరుపుకున్నారు. బీకే యోగీశ్వరి, బీకే కమలాక్షి హాజరైన భక్తులకు శ్రీమద్ భగవద్గీత శ్లోకాల సారాంశాన్ని వివరించారు. రోజూ భగవద్గీతను వినడం, చదవడం, ఆచరణ అలవర్చుకుంటే ప్రతి సమస్యకూ పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం వెంకటేష్‌బాబు, చంద్రశేఖర్, శివరాంరెడ్డి, ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కళ్యాణదుర్గం డివిజనల్ రెవెన్యూ అధికారి వసంతబాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం సాగునీటి సంఘం ఎన్నికలపై తహసీల్దార్ సుమతితో చర్చించారు. సాగునీటి సంఘం ఎన్నికలు పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నందకిశోర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్‌రెడ్డి, ఆర్ఐ నాగిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బరాయుడు, ఉపాధిహామీ ఈసీ జయప్రకాష్ , వీఆర్వోలు, లక్ష్మన్న, వేణుగోపాల్, మర్రిస్వామి, రామకృష్ణ, ఓబుళమ్మ, ఆంజనేయులు, మల్లికార్జున, హనుమంతరావు తదితరులు హాజరయ్యారు.

వ్యాసాపురంలో కలుషిత నీరు సరఫరా




వ్యాసాపురంలో సరఫరా అయిన రంగు మారిన నీరు

ఉరవకొండ: మండలంలోని వ్యాసాపురం గ్రామంలో కొన్ని రోజులుగా కొళాయిల్లో కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ నీరు తాగి ప్రజలు జలుబు, దగ్గు, జ్వరం బారిన పడి మంచాన పడుతున్నారు. కలుషిత నీరు సరఫరా అవుతుందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అంటున్నారు. గత్యంతరం లేక కిలోమీటరు దూరం వెళ్లి బోరుబావుల వద్ద నీరు తెచ్చుకుంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

రేపు భారీ బహిరంగ సభ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముస్లింలు


కంబదూరు: ఈ నెల 15న కడపలో ఆలిండియా జమీయత్ -ఉల్-మా-ఏ-హిందూ ముస్లిం మైనార్టీ సంఘం ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఉంటుందని ముస్లిం సంఘాల ప్రతినిధులు తెలిపారు. కంబదూరు ముస్లిం సంఘాల నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం ఆహ్వాన పోస్టర్లు, ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముస్లింలు అల్లాబకాష్, వలి, అబ్దుల్ రెహమాన్, మౌలానా యూసూప్ రఫీ, షెక్షావలి, ఆదంవలీ, జెబీవుల్లా, ఫయాజ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



కురుబ శేఖర్ (ఫైల్)

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పదోతరగతి విద్యార్థి కురుబ శేఖర్ (15) మృతి చెందినట్లు డి.హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన మేరకు.. బొమ్మనహాళ్‌కు చెందిన కురుబ తిప్పేస్వామి, కురుబ అంబమ్మ దంపతులకు కుమారై, కుమారుడు కురుబ శేఖర్ ఉన్నారు. కురుబ శేఖర్ స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్నాడు. ఈనెల10న కురుబ శేఖర్ తన స్నేహితుడు ఇమ్రాన్‌తో కలిసి డి.హీరేహాళ్ ఎస్‌బీఐ బ్యాంకులో డబ్బులు కట్టడానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, హిర్దేహాళ్ సమీపంలోని మలుపులో అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో కురుబ శేఖర్‌కు తీవ్ర గాయాలు కాగా, బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఇమ్రాన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సాగునీటి సమరం..

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

- టీసీ మెంబర్లు, డబ్ల్యూ ప్రెసిడెంట్లకు ఓటింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

సర్వం సిద్ధం

రాయదుర్గం: రాయదుర్గం, ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో సాగునీటి సంఘాల సమరానికి సర్వం సన్నద్ధం చేశారు. సంబంధిత అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. శనివారం ఉదయం 8 గంటలకే ఎన్నికలు ప్రారంభమై సాయంత్రం 5 గంటల్లోపు వివిధ దశల్లో టీసీ మెంబర్లు, డబ్ల్యూ ప్రెసిడెంట్ల ఎంపిక పూర్తి చేయనున్నారు. దీంతో నీటి వినియోగదారుల ప్రాదేశిక నియోజకవర్గాల్లో ఎన్నికల కోలాహలం నెలకొంది.రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 48 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 6 మీడియం, హెచ్ఎల్‌సీ పరిధిలోని 11 మొత్తం 59 నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 59 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల పరిధిలోని ఒక్కో డబ్ల్యూఏ (ప్రెసిడెంట్)కు ఆరుగురు మొత్తం 48 డబ్ల్యూఏలకు 288 టీసీ మెంబర్లు, మీడియం, హెచ్ఎల్‌సీ పరిధిలోని ఒక్కో డబ్ల్యూఏ (ప్రెసిడెంట్)కు 12 మంది మొత్తం 17 డబ్ల్యూఏ (వాటర్ యూజర్స్ అసోసియేషన్)లకు 204 టీసీ మెంబర్లు ఎంపిక చేస్తారు. ఎమ్ఐ ట్యాంకుల పరిధిలోని ఒక్కో టీసీ మెంబర్‌కు 50 నుంచి 100 లోపు ఓటర్లు ఉండగా, మీడియం, హెచ్ఎల్‌సీ పరిధిలో 150 నుంచి 200 ల వరకు ఓటర్ల జాబితా తయారుచేశారు. ఓటు హక్కు కలిగిన ప్రతి రైతూ ఎన్నికలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రైతుల మధ్య ఎన్నికల కోలాహలం మొదలైంది. ప్రభుత్వాలతో పనిలేకుండా రైతు పక్షాన పోరాటం చేసే నాయకుడ్ని ఎన్నుకునేలా కసరత్తు చేస్తున్నారు.

నిబంధనలు ఇలా..

సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు కచ్చితమైన నిబంధనలు పాటించాలి. 18 ఏళ్లు పైబడిన వారు మాత్రమే పోటీకి అర్హులు. ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నవారు, పారితోషకాలు పొందేవారు పోటీకి అనర్హులు. ఎన్నికల్లో పోటీ చేసే వారు తప్పనిసరిగా నీటిపన్ను చెల్లించాలి. ఎన్నికలను మూడు విధాలుగా నిర్వహిస్తారు. తొలుత అభ్యర్థులను అక్షరమాల ప్రకారం వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు. ముందుగా ఏకగ్రీవం చూస్తారు. తర్వాత వరుస క్రమంలో తొలి అభ్యర్థిని వేదిక పైకి పిలిచి చేతులు పైకెత్తే విధానం చేస్తారు. ఎక్కువ మద్దతు వచ్చిన వారిని విజేతలుగా ప్రకటిస్తారు. ఈ విధానం వీలుపడకపోతే రహస్య బ్యాలెట్‌ను అనుసరిస్తారు. ఓటు వేసే రైతులు పట్టాదారు పాసు పుస్తకం లేకపోయినా హక్కును నిరాకరించరు. ఓటరుకార్డు, ఆధార్‌కార్డు లేదా ఏ ఇతర గుర్తింపు కార్డుతోనైనా ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపాలి

ఏకాభిప్రాయంతో కాకుండా అంతా ఏకపక్షమై నీటి సంఘాలకు ఎన్నికలు జరిపేలా కృషి చేయాలని రైతులు, రైతు సంఘాలన్నీ డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా గుర్తు చేశారు. గతంతోనూ 2015 సెప్టెంబర్‌లో ఏకాభిప్రాయంతో కాకుండా ఎన్నికలు జరిపారని తప్పుపట్టారు. ఈ సారి ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుత వాతావరణంలో ఈ ఎన్నికలు పూర్తయ్యేలా కృషి చేయాలని కోరారు.

ఎమ్ఐ ట్యాంకులు, మీడియం, హెచ్ఎల్‌సీ పరిధిలోని వివరాలు

నియోజకవర్గం	ఎమ్ఐ ట్యాంకుల (డబ్ల్యూఏలు)	మీడియం (డబ్ల్యూఏలు)	హెచ్ఎల్‌సీ (డబ్ల్యూఏలు)
రాయదుర్గం	12	04	11
కళ్యాణదుర్గం	25	02	00
ఉరవకొండ	11	00	00

ఎన్నికల నిర్వహణ ఇలా..

ఉదయం తొమ్మిది గంటల్లోపు రైతులంతా పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవాలి. 9:45 నుంచి టీసీ మెంబర్ల ఎన్నిక కోసం నామినేషన్ల స్వీకరిస్తారు. 9:45 నుంచి 10:15 వరకు ఏకాభిప్రాయానికి అవకాశం. 10:15 నుంచి 10:30 లోపు నామినేషన్లు పరిశీలించి ఫైనల్ పబ్లికేషన్ చేస్తారు. 10:30 నుంచి 12:30 వరకు ఎన్నిక నిర్వహించి మధ్యాహ్నం 1 గంటలోపు ఫలితాలు వెల్లడిస్తారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల్లోపు టీసీ మెంబర్లంతా కలసి డబ్ల్యూఏ ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్ల ఎంపిక పూర్తి చేస్తారు.

సమయానికి రైతులు చేరుకోవాలి



రైతులంతా సమయానికి పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవాలి. నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించేలా ప్రణాళికలు చేపట్టాం. అన్ని పోలింగ్ బూత్‌లకు అధికారులు, సిబ్బందిని నియమించాం. ఉదయం ఏడు గంటల్లోపు వారంతా పోలింగ్ కేంద్రాలు చేరుకుంటారు. శాంతియుతంగా ఎన్నికలు జరుపుకునేలా రైతులంతా కృషి చేయాలి.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేలా చర్యలు చేపట్టాం. ఓటర్లు, పోటీదారులు మాత్రమే పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలి. రైతులంతా సమన్వయంతో శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలి. పోలింగ్ కేంద్రాల వద్ద తగిన పోలీస్ సిబ్బందిని నియమించాం. పర్యవేక్షణకు ప్రత్యేక టీంలు ఎంపికచేశాం.

– రవిబాబు, డీఎస్పీ, కళ్యాణదుర్గం

కీలకంగా మారనున్న బీటీ ప్రాజెక్ట్ చైర్మన్..

బీటీప్రాజెక్ట్ చైర్మన్ కుర్చీకి కూటమిలో కుమ్ములాట కనిపిస్తోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల్లో ఎడమ, కుడి కాలువల పరిధిలో 12,400ల ఎకరాల ఆయకట్టు ఉంది. గుమ్మఘట్టలో నాలుగు, బ్రహ్మసముద్రంలో రెండు మొత్తం ఆరు డబ్ల్యూఏ ప్రెసిడెంట్లు ఎన్నిక పూర్తవుతుంది. చైర్మన్ ఎంపికకు నోటిఫికేషన్ వెలువడ్డాక ఆరుగురు కలిసి బీటీప్రాజెక్ట్ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకోనున్నారు. ప్రస్తుతం ఈ కుర్చీ హాట్‌టాఫిక్‌గా మారింది. ఈ కుర్చీ కోసం కూటమి నేతల్లోని కొందరు భారీగా పావులు కదుపుతున్నారు.

అధినేతను కలిసిన నియోజకవర్గ నాయకులు



వైఎస్సార్‌సీపీ అధినేతతో ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ: తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు శుక్రవారం కలిశారు. కూడేరు మండలానికి చెందిన వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మతి హనుమంతరెడ్డి, బెళుగుప్ప మండల ప్రధాన కార్యదర్శి బోడిమల్ల రవీందర్‌రెడ్డి, నక్కలపల్లి ముత్యాల రెడ్డిలు అధినేతను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఒకేషనల్ విద్యార్థులకు శిక్షణ

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాల వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు క్షేత్ర స్థాయిలో ఆన్ జాబ్ ట్రైనింగ్‌పై శుక్రవారం శిక్షణ కల్పించారు. సిరికల్చర్, కన్‌స్ట్రక్షన్, ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, బీఆర్ఎం, ఏఅండ్‌టీ విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ వీరేష్ తెలిపారు.

అపరిశుభ్రతతోనే వ్యాధులు

బొమ్మనహాళ్: ఇళ్ల పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు విజృంభిస్తాయని, రోగాలు వ స్తా యని శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతా భార్గవి ప్రజలకు సూచించారు. శుక్రవారం మండలంలోని లింగదహాళ్ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వ హించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి వారికి మందులు అందించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, ఎంఎల్‌హెచ్‌ఈఓ శివప్రసాద్, ఏఎన్ఎంలు ఎర్రమ్మ, అలివేలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

వజ్రకరూరు: మండలంలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ షెక్షావలి శుక్రవారం తెలిపారు. శనివారం 33 కేవీ ఉరవకొండ ఫీడర్‌లో మరమ్మతులు చేస్తుండడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి జాతర

కుందుర్పి: కొలిమిపాళ్యంలో శనివారం నుంచి సోమవారం వరకు శ్రీమచ్చంద్రమయ్య జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం జలధి, ఆదివారం గ్రామోత్సవం, ఆవుల (గూడు) జాతర, రాత్రికి ఉత్సవం, సోమవారం ఉదయం వెండి పల్లకీ ఉత్సవం, సాయంత్రం పానకం బండ్ల ఊరేగింపు,అన్నదానంతో ఉత్సవం ముగుస్తుందని వారు తెలిపారు.

ఐదు నెలల తర్వాత పోస్టుమార్టం

డి.హీరేహాళ్ (బొమ్మనహాళ్): డీహీరేహాళ్ మండలంలోని మల్లికేతి సమీపంలోని వంకలో గత మే నెలలో ఎంకప్ప కుమారుడు చరణ్ (12) ఈతకు వెళ్లి నీట మునిగి చనిపోయాడు. అయితే మృతుడి తండ్రి ఎంకప్ప ఫిర్యాదు మేరకు ఐదు నెలల తర్వాత ఖననం చేసిన శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ అనీల్‌కుమార్ సమక్షంలో ఫోరెన్సిక్ డాక్టర్‌తో చరణ్ శవానికి పోస్టుమార్గం నిర్వహించిన్నట్లు ఎస్ఐ తెలిపారు.

పౌరాణిక కళాకారుడికి డాక్టరేట్ ప్రదానం

గుమ్మఘట్ట: గోనబావికి చెందిన పోగునూరు రంగస్వామికి హైదరాబాద్‌లోని ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌ను శుక్రవారం ప్రదానం చేశారు. రంగస్వామి వందలసంఖ్యలో పౌరాణిక నాటకాల్లో పాత్రలు పోషించారు. నాటక రంగానికి చేసిన సేవలను గుర్తించిన హైదరాబాద్‌లోని ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ సంస్థ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది.

నేడు మెగా జాబ్ మేళా

ఉరవకొండ: స్థానిక ఎస్‌కే ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. దాదాపు 5వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఇందులో 60 ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయి. పదోతరగతి, ఇంటర్, డిప్లమో, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ(ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ) పూర్తి చేసిన వారు ఉద్యోగాలకు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చు.

కదంతొక్కారు..ఒక్కటై కదిలారు



రాయదుర్గం నుంచి రైతు ర్యాలీకి తరలివెళ్తున్న మాజీ ఎమ్మెల్యే మెట్టు, పార్టీ శ్రేణులు

రాయదుర్గం: రైతుల పట్ల కూటమి ప్రభుత్వం చేస్తున్న దగాకు నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసనకు సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, రైతులు, రైతు సంఘాల నాయకులు వంద వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మొదటి పిలుపుకే రైతులు ఊరూరా ఒక్కటై స్వచ్ఛందంగా కదలివచ్చి .. సమస్యలపై గళంవిప్పారన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీకి, వైఎస్ జగన్‌కు రైతుల్లో ఉండే అభిమానం ఎలాంటిదో రుజువు చేశారన్నారు. సీఎం చంద్రబాబుకు తొలి నిరసన ర్యాలీకే చెమటలు పట్టేలా చేశామన్నారు. రైతన్నలతో అనంత దద్దరిల్లిపోయిందన్నారు. రైతులను మోసం చేసిన అనేక హామీలపై మీడియాతోనూ పంచుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని నలుమూలల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చి, ర్యాలీకి మద్దతుగా నిలిచిన పార్టీ నాయకులు, రైతులు, రైతు సంఘాల నాయకులకు మెట్టు కృతజ్ఞతలు తెలిపారు.

కళ్యాణదుర్గం: జిల్లా కేంద్రంలో రైతు సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి ర్యాలీకి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఐదు మండలాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఎంపీపీలు అంజనేయులు , చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణ పురం వెంకటేశులు, గోళ్ల సూరి, లక్ష్మన్న, కొత్తూరు బాబు, లాయర్ రామాంజనేయులు, గంగాధరప్ప, ఎంఎస్ రాయుడు, డి.తిప్పేస్వామి, కెంచంపల్లి పాలాక్షి, రాజగోపాల్, తిప్పేస్వామి, రాములుతోపాటు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.



అనంతపురంలో దుర్గం నేతలతో కలిసి వెళ్తున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య, పార్టీ నేత ఉమామహేశ్వర్ నాయుడు

నిరసన ర్యాలీకి తరలివెళ్తున్న నాయకులు

కుందుర్పి: రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ జిల్లా కేంద్రంలో శుక్రవారం చేపట్టిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమానికి మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ర్యాలీకి తరలివెళ్లిన వారిలో మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మాజీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు తిప్పేస్వామి, సర్పంచులు జగన్, అతావుల్లా, విజయ్, ఎంపీటీసీ హనుమంతరాయుడు, నాయకులు మర్రంట్ గోపాల్, మహంతపురం రాయుడు, ఈ.రాము, భాగ్యరాజు, డీలర్ రమేష్, అప్పిలేపల్లి మరిస్వామి తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి



జిల్లా కేంద్రానికి బయల్దేరుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మహబూబ్ బాషా



సాగునీటి ఎన్నికల ప్రక్రియపై నిబంధనలను వివరిస్తున్న ఎన్నికల ప్రత్యేకాధికారి సుధాకర్

కూడేరు: సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ మహబూబ్ బాషా సూచించారు.శుక్రవారం సాగునీటి సంఘాల ఎన్నికల అధికారులుగా నియమించిన అధికారులకు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నిర్వాహణ ఏవిధంగా నిర్వహించాలో తహసీల్దార్ మహబూబ్ బాషా ఎన్నికల నిర్వాహణాధికారి సురేష్ బాబుతో కలిసి అవగాహన కల్పించారు. శనివారం మండలంలోని పొట్టి చెరువు, అరవకూరు, ఇప్పేరు, మరుట్ల ఆయకట్టుకు సంబంధించి సాగునీటి సంఘాల ఎన్నికలను నిష్పక్షపాతంగా జరపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుల్లాయిస్వామి, ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఏఓ విజయ కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని (మేజర్ ఇరిగేషన్-10, మీడియం ఇరిగేషన్-6, మైనర్ ఇరిగేషన్-40) మొత్తం 56 నీటి సంఘాలు, 432 ప్రాదేశిక నియోజకవర్గాలకు శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆర్‌డీఓ వంసత్‌బాబు శుక్రవారం తెలిపారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలోని 11మండలాలకు శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేదుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

బొమ్మనహాళ్: రెండు సార్లు వాయిదా పడిన సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఎట్టకేలకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఈ నేపథ్యంలో శనివారం మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా ఏడు సాగునీటి సంఘాలు, ఒక చెరువు సంఘం ఎన్నికలు జరగనున్నాయి. మైనర్ ఇరిగేషన్ చెరువు సంఘం ఎన్నికలకు 275 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హెచ్చెల్సీ సాగునీటి సంఘాలు 7 కాగా 14,231 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. హెచ్చెల్సీ సాగునీటి సంఘాలు బొల్లనగుడ్డం, బండూరు, కల్లుదేవనహళ్లి, హరేసముద్రం, ఉద్దేహాళ్, కొలగానహళ్లి, శ్రీధరఘట్ట హెచ్చెల్సీ సాగునీటి సంఘాలు కాగా శ్రీధరఘట్ట గ్రామంలో మైనర్ ఇరిగేషన్ చెరువు సంఘం ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. మొత్తం 8 సంఘాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల నిర్వహణకు మొత్తం 180 మంది సిబ్బందిని నియమించిన్నట్లు తెలిపారు.

నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించండి

బెళుగుప్ప: మండల పరిధిలోని మూడు గ్రామాల చెరువుల ఆయకట్టు సాగునీటి సంఘాలకు శనివారం జరగనున్న ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని సాగునీటి సంఘాల ఎన్నికల ప్రత్యేకాధికారి సుధాకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ షర్మిళ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంఈఓ మల్లారెడ్డి, ఏఓ పృథ్వీసాగర్, ఈఓఆర్‌డీ నాగేశ్వరశాస్త్రితో కలిసి ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని శ్రీరంగాపురం, శీర్పి, గంగవరం గ్రామాల చెరువులకు సంబంధించి సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శీర్పి చెరువు పరిధిలో 111 మంది, శ్రీరంగాపురం చెరువు పరిధిలో 188 మంది, గంగవరం చెరువు పరిధిలో 110 మంది రైతు సభ్యులు ఓటర్లుగా ఉన్నారు.

యానిమేటర్లను ఎలా తొలగిస్తారు?

బ్రహ్మసముద్రం : ఏతప్పు లేకుండా యానిమేటర్లను ఎలా తొలగిస్తారని సీఐటీయూ జిలా అధ్యక్షురాలు నాగమణి , డివిజన్ అధ్యక్షుడు అచ్యుత్ ప్రసాద్ ప్రశ్నించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో అధికారులను నిలదీశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మండల వ్యాప్తంగా పదిమంది యానిమేటర్లను టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో తొలగించారు. నాయకులు మాట్లాడుతూ గ్రామ సమైఖ్య సంఘం సభ్యులు తీర్మానం లేకుండా వెలుగు సీసీలు, సిబ్బంది కలిసి పాత యానిమేటర్లను తొలగించి, కొత్త యానిమేటర్లను తీసుకున్నారన్నారు. యానిమేటర్లకు 5 నెలల జీతాలు బకాయి ఉండగా, వాటికి కూడా చెల్లించలేదన్నారు. తొలగించిన యానిమేటర్లను హైకోర్టు ఆదేశాల మేరకు తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వెలుగు ఏరియా కోఆర్డినేటర్ నారాయణ స్వామి, వెలుగు ఏపీఎం హుసేన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యానిమేటర్లు తిప్పేస్వామి, దేవకుమార్, భీమేష్, నీలస్వామి, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.



ఏరియా కోఆర్డినేటర్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం



నేమకల్లు ఆంజనేయస్వామి



హోమం నిర్వహిస్తున్న పండితులు



ఆంజనేయస్వామి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



అలంకరణలో చౌడేశ్వరిదేవి

ఘనంగా హనుమద్ వత్రం

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమద్ వత్రాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామి మూల విరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. స్వామికి సుప్రభాతసేవ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు, అభిషేకాలు, హనుమత్ వత్రం, పవమాన హోమం, పూర్ణాహుతి పూజలు చేశారు. అనంతరం పల్లకీలో ఉత్సవం నిర్వహించారు. ఈఓ నరసింహారెడ్డి, సిబ్బంది ఓబన్న, అన్నదాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: కలుగోడు గ్రామంలో శుక్రవారం ఆంజనేయస్వామి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.కుంకుమార్చన, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి, విశేష పూజలు చేశారు. ఆంజనేయస్వామి మూలవిరాట్‌ను రథంపై కొలువుదీర్చి ఊరేగించారు.

ముత్యాలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట

కూడేరు: మండలంలోని కమ్మూరులో ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్టను ఘనంగా జరుపుకున్నారు. వేదపండితులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిష్టకు గ్రామస్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. సర్పంచ్ రంగారెడ్డి, గ్రామ పెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి విగ్రహ ప్రతిష్ట

కూడేరు: గొటుకూరులో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం చౌడేశ్వరి దేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఘనంగా సాగింది. ప్రతిష్ఠానంతరం వేదపండితులు చౌడేశ్వరి దేవిని అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల నోట చౌడేశ్వరి దేవి నామస్మరణ మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గజలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు చేసి, హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండు మారెమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.